రైతన్నలకు పెట్టుబడి సాయమేది?

- అప్పు చేసి సాగుకు ఉపక్రమిస్తున్న అన్నదాతలు
- జూలై నెల వచ్చినా రైతు ఖాతాలో జమకాని అన్నదాత సుఖీభవ నిధులు

ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల రోజులు గడిచినా కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయంపై స్పష్టత ఇవ్వడం లేదు. ముందస్తు వర్షాలతో రైతన్నలు జూన్ నెలాఖరిలో పంటల సాగుకు సిద్ధమయ్యారు. అప్పులు తెచ్చి విత్తనాలు వేశారు. అన్నదాత సుఖీభవ నిధులు పడకపోతాయా అని అన్నదాతలు ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం మాత్రం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోంది.

నందికొట్కూరు: నియోజకవర్గంలోని కొత్తపల్లి, పాములపాడు, జూపాడుబంగ్లా, నందికొట్కూరు, పగిడ్యాల, మిడుతూరు మండలాల్లో మొక్కజొన్న, వరి, మినుము, పత్తి, కందులు, పెసరతో పాటు తదితర పంటల విత్తనాలు రైతులు వేశారు. సుమారు 49,767 వేల హెక్టార్లలో పంటలను 42,302 మంది రైతులు సాగు చేశారు. ఖరీఫ్‌కు కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించకపోవడంతో రైతన్నలు అప్పు చేసి విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి విత్తనాలు వేశారు. పెట్టుబడి సాయం ఆలస్యం కావడంతో ఖరీఫ్ సీజన్ పెద్ద సవాల్‌గా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత ప్రభుత్వంలో ఇలా..

గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో ఖరీఫ్ ప్రారంభంలోనే రైతులకు వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయం అందేది. పీఎం కిసాన్ కింద రూ.6 వేలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం రూ.7,500 కలిపి ఏడాదికి రూ.13,500ను మూడు విడతల్లో రైతుల ఖాతాలకే జమ చేసేవారు. ఖరీఫ్ ప్రారంభంలోనే రూ.7,500, పంట కోత సమయంలో రూ.4 వేలు, ధాన్యం విక్రయాలు ప్రారంభమయ్యే సమయంలో రూ.2 వేల చొప్పున జగనన్న హయాంలో ఇచ్చేవారు. నందికొట్కూరు మండలంలో 8,404, మిడుతూరు మండలంలో 8,808, పాములపాడు మండలంలో 7,867, జూపాడుబంగ్లా మండలంలో 7,147, పగిడ్యాల మండలంలో 3,484, కొత్తపల్లి మండలంలో 6,572 మంది రైతుల చొప్పున నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 42,302 రైతుల బ్యాంక్ ఖాతాలకు రూ.57,10,77,000 ఏటా జగనన్న ప్రభుత్వంలో జమ చేసేవారు.



సాగు చేసిన మొక్కజొన్న పంట

కౌలు రైతుకు భరోసా

భూమి లేని రైతులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన కౌలు రైతులు, అటవీ, దేవదాయ భూములు సాగు చేసేవారికి వైఎస్సార్ రైతు భరోసా వర్తింపజేసేది. పీఎం కిసాన్ పథకం కింద తొలి విడతగా కేంద్రం పంపిన రూ.2 వేలు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి అదనంగా రూ.5,500లతో కలిపి రూ.7,500 ఇచ్చే విధానం అమల్లో ఉండేది. నందికొట్కూరు నియోజకవర్గంలో 42,302 మంది రైతులు ఈ పథకానికి అర్హులుగా ఉండేవారు.

జూలై నెల వచ్చినా తప్పని ఎదురుచూపులు

రైతులకు ఏడాదికి రూ.20 వేలను పెట్టుబడి సాయం అందిస్తామని 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమి పార్టీలు హామీల వర్షం కురిపించాయి. అయితే ఇంత వరకు కూటమి ప్రభుత్వం అప్పుడు ఇప్పుడు అంటూ రైతులను కలవరానికి గురిచేస్తుంది. కూటమి ప్రభుత్వం స్పందించి అన్నదాత సుఖీభవ పథకం నిధులు అన్నదాతల బ్యాంక్ ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్నాం



మొక్కజొన్న 10 ఎకరాలు, ఉల్లిగడ్డ 3 ఎకరాలు, వరి 2 ఎకరాలు సాగు చేశాను. మొక్కజొన్న పంట సాగు చేసి నెల రోజులు గడుస్తుంది. ఎకరాకు రూ.10 వేల చొప్పున రూ.లక్ష ఖర్చు వచ్చింది. ఉల్లిగడ్డకు ఎకరాకు రూ.12 వేలు పెట్టుబడి ఖర్చు వచ్చింది. వరి పంట సాగుకు ఎకరానికి రూ.8 వేల వరకు ఖర్చు వచ్చింది. చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు ఇస్తామని ఇచ్చిన హామీ ఇంత వరకు అమలు చేయలేదు.

– జయరాం, కొక్కెరంచ గ్రామం, కొత్తపల్లి మండలం

సీఎం హామీకి దిక్కులేదు



ఎన్నికల ముందు రైతులకు పెట్టుబడి సాయం ఇస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన సీఎం చంద్రబాబు నాయుడు ఏడాది గడిచినా ఇవ్వలేదు. మొక్కజొన్న, ఉల్లిగడ్డ, తదితర పంటలు సాగు చేశాను. పెట్టుబడి సాయం రైతులకు బ్యాంకు ఖాతాలో ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే జమచేస్తామని ఇప్పటికీ చేయలేదు. ఈ బాబు అధికారంలోకి వస్తే రైతులను చిన్నచూపు చూస్తాడు. – నాగభూషణంరెడ్డి, 10 బొల్లవరం గ్రామం, నందికొట్కూరు మండలం

క్లుప్తంగా

మహానందిలో సిద్దిపేట న్యాయమూర్తి పూజలు



మహానందిలో న్యాయమూర్తి చందన, కుటుంబ సభ్యులు

మహానంది: మహానందీశ్వరస్వామి సన్నిధిలో తెలంగాణ రాష్ట్రం సిద్దిపేట సీనియర్ సివిల్ జడ్జి చందన, కుటుంబ సభ్యులు శనివారం పూజలు నిర్వహించుకున్నారు. ముందుగా వారికి ఆలయ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ పి.సుబ్బారెడ్డి స్వాగతం పలికారు. అనంతరం వారు కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. అలంకార మండపంలో స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.

భక్తుల రద్దీ సాధారణం

మహానంది: వీకెండ్ సందర్భంగా భక్తులతో కళకళలాడే మహానంది ఆలయ ప్రాంగణాలు శనివారం ఖాళీగా కనిపించాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు, మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు కొనసాగిన మహానందీశ్వరస్వామి వారిని కొద్దిపాటి మంది భక్తులు దర్శించుకున్నారు. ఉదయం స్థానిక అలంకార మండపంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని ఆధ్వర్యంలో పండితులు, అర్చకులు స్వామి, అమ్మవార్లకు కల్యాణం నిర్వహించారు. దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత ప్రసాదాలు పంపిణీ చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జువాలజీ సబ్జెక్టుకు గెస్ట్ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ జువాలజీలో 55 శాతం మార్కులు తప్పనిసరిగా ఉండాలని, నెట్ లేదా స్లెట్ పాస్ అయిన వారికి, పీహెచ్‌డీ చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. తగిన సర్టిఫికెట్లతో సోమవారం కళాశాల కమిటీ ఎదుట హాజరుకావాలని సూచించారు.

వాహనాల తనిఖీ

వెలుగోడు: పట్టణంలోని ఆత్మకూరు–నంద్యాల ప్రధాన రహదారిలో ఎస్‌ఐ సురేష్ శనివారం వాహనాల తనిఖీ చేపట్టారు. వాహన దారులు ఆర్‌సీ, లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. అతి వేగంతో ప్రమాదాల బారిన పడవద్దని, రోడ్డు నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రోకలిబండతో దాడి

నందికొట్కూరు: మిడుతూరు మండల కేంద్రంలోని పింజరిపేటలో శనివారం స్నేహితులు చిన్న నాగన్న, ఇమాంసాహెబ్ మద్యం తాగుతూ గొడవపడినట్లు ఎస్‌ఐ ఓబులేసు తెలిపారు. మాటామాటా పెరగడంతో ఇమాంసాహెబ్ రోకలిబండతో దాడి చేయడంతో చిన్న నాగన్న తలకు గాయాలయ్యాయన్నారు. క్షతగాత్రుడిని కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

హైబీపీతో బుక్‌కీపర్ మృతి



ఉమాదేవి(ఫైల్)

జూపాడుబంగ్లా: మండలంలోని మండ్లెం గ్రామానికి చెందిన బుక్‌కీపర్ ఉమాదేవి(51) శనివారం హైబీపీతో మృతిచెందారు. కుటుంబ సభ్యులు, ఏపీఎం అంబమ్మ తెలిపిన వివరాలు.. బుక్‌కీపర్ ఉమాదేవి కొంతకాలంగా మోకాళ్లనొప్పులతో బాధపడుతోంది. ఉదయం ఒంట్లో నలతగా ఉండటంతో వైద్యుల వద్ద చూపించుకునేందుకు భర్త, కుమారుడితో కలిసి ఆసుపత్రికి బయలుదేరారు. మార్గమధ్యలో బీపీ అధికం కావటంతో పల్స్ తగ్గిపోయి మృతిచెందినట్లు వారు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతి చెందిన వ్యక్తి

మహానంది: నంద్యాల–గిద్దలూరు నల్లమల రైలు మార్గంలోని బొగద సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఖలీల్ అహమ్మద్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ సుమారు 60 ఏళ్ల వయసున్న ఓ వ్యక్తి నంద్యాల నుంచి నరసరావుపేట వరకు టికెట్ తీసుకున్నాడన్నారు. రాత్రి రైలులో వెళ్లేటప్పుడు కింద పడి మృతి చెందినట్లు తెలుస్తుందన్నారు. మృతి చెందిన వ్యక్తి మూడో తేదీన నరసరావుపేట నుంచి నంద్యాలకు రైలు టికెట్ తీసుకుని వచ్చి మళ్లీ ఇక్కడి నుంచి తిరుగుప్రయాణంలో మృతి చెందినట్లు చెప్పారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లేవని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు వివరించారు.

నూతన బ్రిడ్జి నిర్మించాలి

జూపాడుబంగ్లా: జాతీయరహదారి 340సీ రోడ్డు నిర్మాణంలో భాగంగా 80 బన్నూరు వద్ద పాత బ్రిడ్జిని తొలగించి కొత్త బ్రిడ్జిని నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం సీపీఎం నాయకులు పక్కీర్‌సాహెబ్, కర్ణ, గోపాలకృష్ణ, తదితరులతో కలిసి ఆయన పాత బ్రిడ్జిని పరిశీలించారు.

ఘనంగా సహకార సొసైటీ వారోత్సవాలు



మొక్కలు నాటుతున్న జిల్లా సహకార సొసైటీ అధికారి రామాంజనేయులు



సొసైటీ జెండాను ఆవిష్కరిస్తున్న సీఈఓ ఖాజా



పరమటూరులో సహకార పతాకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

పాములపాడు: స్థానిక వ్యవసాయ సహకార పరపతి కార్యాలయంలో అంతర్జాతీయ సొసైటీ వారోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా సహకార అధికారి ఎస్.రామాంజనేయులు హాజరై సొసైటీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతుల అభివృద్ధే లక్ష్యంగా సహకార సొసైటీలు పనిచేస్తున్నాయన్నారు. అన్ని రకాల రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందులు, విత్తనాల సరఫరాతో పాటు స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు, బంగారు ఆభరణాలపై రుణాలు, పంట రుణాలు మంజూరు చేస్తూ రైతుల సేవలో సొసైటీలు పనిచేస్తున్నాయన్నారు. అనంతరం సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆత్మకూరు బ్రాంచ్ మేనేజర్ ఎస్.రసూల్, స్థానిక సొసైటీ పర్సనల్ ఇన్‌చార్జ్ శివరామకృష్ణ, సీనియర్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, జేఏ ఖాదర్‌బాషా, సీఈఓ లక్ష్మణ్‌నాయక్ పాల్గొన్నారు.

పగిడ్యాల: అంతర్జాతీయ సొసైటీ వారోత్సవాలను పురస్కరించుకుని వారం రోజుల పాటు సహకార సొసైటీ వారోత్సవాలను నిర్వహించనున్నట్లు సీఈఓ ఖాజా తెలిపారు. సొసైటీ కార్యాలయం ఎదుట సొసైటీ జెండాను శనివారం ఆవిష్కరించారు. రైతుల అభ్యున్నతి ఏర్పాటైన సహకార సొసైటీ సేవలను మరింత విస్తృతం చేశామన్నారు. చిన్న, సన్నకారు రైతులే గాకుండా కౌలు రైతులు కూడా సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని సంతజూటూరు గ్రామంలోని ది పరమటూరు రైతు సేవ సహకార సంఘంలో కేడీసీసీ బ్యాంకు మేనేజర్ సుధారాణి ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని నిర్వహించారు. సహకార పతాకాన్ని ఆవిష్కరించి, బ్యాంకు ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ శ్రీవాణి, బ్యాంకు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పొంచివున్న ప్రమాదం



రక్షణ వలయం లేని పడమర ప్రాతకోట ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు



నివాస ప్రాంతాల మధ్య కంచె లేకుండా ఉన్న కొత్త ముచ్చుమర్రి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

పగిడ్యాల: పగిడ్యాల, ముచ్చుమర్రి, ప్రాతకోట, లక్ష్మాపురం, నెహ్రూనగర్ తదితర గ్రామాల్లోని సింగిల్ ఫేజ్, త్రీ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్‌లు ప్రమాద భరితంగా కనిపిస్తున్నా సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండడంపై సర్వత్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రామాల్లో నివాస ప్రాంతాల మధ్య ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల చుట్టూ రక్షణ వలయాలు లేకపోవడంతో ప్రమాదం పొంచివుంది. ట్రాన్స్‌ఫార్మర్‌ల చుట్టూ పిచ్చి మొక్కలు, కంప పొదలు మొలిచి ట్రాన్స్‌ఫార్మర్ ఫీజు క్యారియర్ స్టాండ్‌ను, విద్యుత్ తీగలకు, అర్త్ వైర్ తీగలకు అల్లుకుపోయాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున ట్రాన్స్‌ఫార్మర్ పరిసర నివాసవాసులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు.

ఆశల విత్తు!



మొక్కజొన్న విత్తనాలు నాటుతున్న కూలీలు

రెండు రోజుల క్రితం కురిసిన వర్షాలకు జూపాడుబంగ్లా మండలంలోని తాటిపాడు, 80బన్నూరు, పోతులపాడు, తరిగోపుల, మండ్లెం, పారుమంచాల, తూడిచెర్ల, తర్తూరు తదితర గ్రామాల్లో రైతులు మొక్కజొన్న, పత్తి, కంది విత్తనాలు విత్తుకుంటున్నారు. మండలంలో ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 9,605 హెక్టార్లు కాగా బోర్లు, బావులున్న రైతులు 1,500 హెక్టార్లలో పత్తి, మొక్కజొన్న, మిరప, కంది పంటలను ఇదివరకే సాగు చేసుకున్నారు. కేసీ కాల్వ ఆయకట్టు, వర్షాధారం కింద మరికొంత మంది రైతులు పత్తి, మొక్కజొన్న, కంది విత్తనాలు విత్తుకుంటున్నారు. ప్రస్తుతం గ్రామాల్లోని రైతులు విత్తనాలు విత్తుకోవడంలో బిజీగా ఉన్నారు. వ్యవసాయ కూలీలు రోజు వారి కూలీ రూ.400 నుంచి రూ.500 కావటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూలీరేట్లతో పాటు రసాయనిక మందుల ధరలు, సేద్యం ఖర్చులు పెరిగినా రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధరలు కల్పించకపోవటంతో రైతులు కుదేలవుతున్నారు. – జూపాడుబంగ్లా

నాటు సారా విక్రయిస్తే చర్యలు తప్పవు



నీలిషికారిపేటలో బెల్లం ఊట ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ శాఖ సీఐ, సిబ్బంది

నందికొట్కూరు: నాటు సారా విక్రయిస్తే చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు నాయక్ హెచ్చరించారు. శనివారం పట్టణ పరిధిలోని నీలిషికారి పేటలో సిబ్బందితో కలిసి ఆయన సోదాలు నిర్వహించారు. సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 300 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. నీలిషికారి ముకింద్ర నుంచి 30 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అనంతరం కాలనీవాసులకు సారా వల్ల కలిగే నష్టాలను వివరించారు. సహకార బ్యాంక్ మేనేజర్ నాగరాజును కలిసి నీలిషికారులకు రుణాలు మంజూరు చేసి వారి ఆర్థికాభివృద్ధికి సహకరించాలని సీఐ కోరారు.

చెత్త సేకరణ పరిశీలన



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

వెలుగోడు: మురుగు కాలువల్లో చెత్త వేయకుండా పారిశుధ్య సిబ్బంది వచ్చినప్పుడు అందజేయాలని ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి ప్రజలకు సూచించారు. శనివారం మోతుకూరు గ్రామంలో చెత్త సేకరణను ఎంపీడీఓ పరిశీలించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా నిల్వ ఉంచి పారిశుధ్య సిబ్బంది వచ్చినప్పుడు చెత్త బండిలో వేయాలన్నారు. సేకరించిన చెత్తను సంపద తయారీ కేంద్రానికి తరలించాలని సిబ్బందికి సూచించారు.

క్షుద్రపూజల కలకలం



మహానంది: గరుడనంది–పోలీస్ స్టేషన్ సమీపంలోని చింతచెట్టు వద్ద శనివారం క్షుద్రపూజలు కలకలం రేపాయి. చీర, ఇతర వస్త్రాలతో పాటు కుంకుమ కలిపిన ఎర్రటి బియ్యం, ఆకులు, ఉండటంతో ఎవరైనా గుప్త నిధుల కోసం క్షుద్ర పూజలు చేశారా లేక చేతబడులా అనేది చర్చనీయాంశంగా మారింది.

అప్కాస్‌ను కొనసాగించాలి

కొత్తపల్లి: అప్కాస్‌ను రద్దు చేసే ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వి.యేసురత్నం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నరసింహ నాయక్, సహాయ కార్యదర్శి స్వాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు, కాంట్రాక్టు ఉద్యోగులకు నష్టం కలిగించేలా లేబర్ కోడ్లను తెచ్చిందన్నారు. కేంద్రానికి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మద్దతు పలకడం సిగ్గుచేటన్నారు.

ఎద్దుల బండిని ఢీకొన్న ఆటో

- ఎద్దు మృతి, ముగ్గురికి గాయాలు

డోన్ టౌన్: ఎద్దుల బండిని ఆటో ఢీకొనడంతో ముగ్గురికి గాయాలు కాగా ఎద్దు మృతిచెందింది. ఈ ఘటన మండలంలోని ఉడుములపాడు గ్రామ సమీపంలో శనివారం చోటుచేసుకుంది. కృష్ణగిరి మండలం అముకదాడు గ్రామానికి చెందిన రైతు దంపతులు ఉడుములపాడు గ్రామంలో ఉన్న కుమార్తె పొలంలో విత్తనాల విత్తడానికి కాడి ఎద్దులతో బండిపై వస్తుండగా డోన్ నుంచి టమాట లోడుతో వెళ్తున్న ఆటో ఎద్దుల బండిని ఢీకొంది. రైతు దంపతులతో పాటు డ్రైవర్ గాయపడడంతో డోన్ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తీసుకెళ్లారు.

సర్పాల సయ్యాట!



కొత్తపల్లి మండల పరిధిలోని గువ్వలకుంట్ల గ్రామ సమీపంలో శనివారం సర్పాలు సయ్యాటలో మునిగిపోయాయి. వరి పొలంలో సర్పాలు సయ్యాటలాడుతుండగా కొందరు రైతులు గమనించి సెల్‌ఫోన్లలో చిత్రీకరించారు. అలజడి చేసినా సర్పాలు పట్టించుకోకుండా గంటల తరబడి సయ్యాటలో నిమగ్నమయ్యాయి. – కొత్తపల్లి

హిందూ ధర్మాన్ని పాటించాలి



మాట్లాడుతున్న ఇస్కాన్ ధర్మ ప్రచారకులు నిత్యతృప్తదాస్

జూపాడుబంగ్లా: ప్రతి ఒక్కరూ హిందూధర్మ సిద్ధాంతాలు, ఆచారాలు, సంప్రదాయాలను పాటించాలని తిరుమల తిరుపతి దేవస్థానం ఉమ్మడి కర్నూలు జిల్లా ధర్మప్రచార పరిషత్ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని తరిగోపుల గ్రామం సీతారామాంజనేయస్వామి ఆలయంలో ధార్మిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఇస్కాన్ ధర్మ ప్రచారకులు నిత్యతృప్తదాస్, శ్రీనివాసరామానుజదాస్‌లు మాట్లాడుతూ పాశ్చాత్య సంస్కృతి పోకడలతో హిందూధర్మ సంప్రదాయాలను విస్మరించవద్దన్నారు. హిందూ స్త్రీలు నిత్యం వేకువజామున నిద్రలేచి ఇళ్లను శుభ్రం చేసుకొని కళ్లాపి చల్లి ముగ్గులతో ఇంటి ముంగిళ్లను అలంకరించుకోవటం వల్ల ఆ ఇంట్లో లక్ష్మీదేవత కొలువై ఉంటుందన్నారు. కట్టుబొట్టుతో సనాతన ధర్మాలను పాటిస్తూ నిత్యం గోపూజతో పాటు దేవతారాధన చేయటం అలవర్చుకోవాలన్నారు. అనంతరం సామూహిక కుంకుమార్చన, గోపూజ కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో రామానందస్వామిజీ, సర్పంచ్ అంజనమ్మ, అర్చకులు రామచంద్రయ్య, మండడినారాయణరెడ్డి, నాగార్జునరెడ్డి, నాగేశ్వరరావు, శివశంకరరెడ్డి, రామచంద్రుడు పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధికి ప్రణాళికలు

- ఆంగ్రో వీసీ డాక్టర్ శారద జయలక్ష్మి



వార్షికోత్సవంలో మాట్లాడుతున్న వీసీ డాక్టర్ శారద జయలక్ష్మి

మహానంది: మహానంది ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ కళాశాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించామని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం(ఆంగ్రో) వైస్ చాన్సలర్ డాక్టర్ శారద జయలక్ష్మి తెలిపారు. శనివారం నిర్వహించిన కళాశాల వార్షికోత్సవలో ఆమె మాట్లాడుతూ రూ.50 లక్షలతో ఎగ్జామినేషన్ హాల్ నిర్మిస్తామన్నారు. అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం రూ. 2.50 కోట్లతో ప్రతిపాదనలు పంపించామన్నారు. పీజీలో అగ్రానమీ, ప్లాంట్ బ్రీడింగ్, సాయిల్ సైన్స్ కోర్సులకు త్వరలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసర్చ్(ఐసీఏఆర్) ఆధ్వర్యంలో యూనివర్సిటీ పరిధిలో రూ.6.50 కోట్లు మంజూరు చేశారని, అందులో నుంచి రూ.55 లక్షలు స్మార్ట్ క్లాసులకు, రూ.36 లక్షలు ఎస్సీ, ఎస్టీ మహిళల రైతుల ఆర్థికాభివృద్ధికి కేటాయించామన్నారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్ డాక్టర్ వి.జయలక్ష్మి, నంద్యాల ఆర్‌ఏఆర్‌ఎస్ ఏడీఆర్ డాక్టర్ జాన్సన్, డీన్ ఆఫ్ అగ్రికల్చర్ యూనివర్సిటీ డాక్టర్ సి.శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

భక్తిశ్రద్ధలతో పగలు సరిగెత్తు



తాటిపాడులో పీర్ల ఊరేగింపు దృశ్యం

జూపాడుబంగ్లా: మొహర్రం సందర్భంగా శనివారం పగలు సరిగెత్తును భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. తాటిపాడు,మండ్లెం,తంగడంచ, తరిగోపుల, తర్తూరు, జూపాడుబంగ్లా తదితర గ్రామాల్లో కొలువుదీరిన హసన్, హుసేన్ పీర్లను ఆయా గ్రామాల్లో ఊరేగించారు. ఇంటింటికి వెళ్లి భక్తుల నుంచి పూజలు అందుకున్నారు.

రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకోవాలి

నందికొట్కూరు: రాజీ మార్గంలో కేసులను పరిష్కారం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి శోభరాణి సూచించారు. శనివారం కోర్టు ఆవరణలో జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో జడ్జి మాట్లాడుతూ ప్రజలకు చట్టాలపై అవగాన కల్పించే బాధ్యత అందరిపై ఉందన్నారు. 533 కేసులలో ఐపీసీ–27, ఎక్సైజ్ శాఖ–32, సివిల్ తగాదాలు–4, ఈపీ–1, ఎస్టీసీ–488, బ్యాంక్–1 కేసులను పరిష్కరించామన్నారు.

మాజీ సర్పంచ్ ఇంట్లో చోరీ

కొలిమిగుండ్ల: కల్వటాల మాజీ సర్పంచ్ భూలక్ష్మి ఇంట్లో శనివారం గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. వివరాలు.. భూలక్ష్మి, రామ్మోహన్ దంపతులు ఇంటిపైన నిద్రించి తల దిండు కింద ఇంటితాళాలు పెట్టారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటిపైకి చేరుకుని దిండుకింద ఉన్న తాళాలు తీసుకొని ఇంట్లోకి వెళ్లి బీరువాలో ఉన్న 10 తులాల బంగారు వస్తువులు, రూ. లక్ష నగదును అపహరించారు. తెల్లవారాక ఇంటి తాళాలు కనిపించకపోవడంతో కిందకు దిగి వచ్చారు. అప్పటికే ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. చోరీ జరిగిందని భావించి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ రమేష్‌బాబు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు ఆరాతీశారు. డాగ్ స్క్వాడ్, ఫ్రింగర్ ప్రింట్ టీంలు ఇంటి పరిసరాలను పరిశీలించారు. చోరీకి పాల్పడింది స్థానికులా లేక ఇతర ప్రాంతాలకు చెందిన వారా అనే కోణంలో విచారణ చేస్తున్నామని సీఐ తెలిపారు.

పంచాయతీల అభివృద్ధే లక్ష్యం



శిక్షణ ఇస్తున్న రిసోర్స్‌పర్సన్

నంద్యాల(అర్బన్): పంచాయితీల అభివృద్ధే లక్ష్యంగా అధికారులు ముందుకెళ్లాలని జెడ్పీ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో శనివారం పంచాయతీ లెవెల్ యాక్షన్ ప్లాన్‌పై జిల్లాస్థాయి ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాబోవు ఆర్థిక సంవత్సర ప్రణాళికలను పక్కాగా తయారు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో పాల్గొన్న రిసోర్స్ పర్సన్లు ప్రణాళిక తయారీపై అవగాహన కల్పించారు. డీఆర్డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.